చినుకుపడితే.. చిత్తడే

● బురదమయంగా అంతర్గత రోడ్లు

మరిపెడ : చినుకుపడితే..రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి.. కనీసం నడవలేని స్థితిలో వీధులన్నీ బురదమయం అవుతున్నాయి. మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని పూలబజారులోని పలు వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించక పోవడంతో వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ వీధి ప్రజల పరిస్థితి దయనీయంగా ఉంటోంది. వీధుల్లో నడిచి వెళ్లేందుకు కూడా వీలు లేని పరిస్థితి. వానొస్తే మూడు రోజుల వరకూ వర్షపు నీరు వీధులోనే నిలిచి ఉంటోంది. సైడు కాల్వలు కూడా లేకపోవడంతో నీరు నిలిచి చిత్తడిగా మారుతోంది. దీంతో స్థానికులు తరచూ రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. పలుమార్లు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.


పూలబజారులో చిత్తడిగా మారిన రోడ్డు

పాలకులు స్పందించాలి



పూలబజార్ వీధుల్లో వర్షపు నీరు నిల్వకుండా చేయాలి. వర్షాకాలంలో అనేక ఇబ్బందులు పడుతున్నాం. సీసీ రోడ్లతో పాటు సైడు కాల్వలు నిర్మించాలి. రోగాల బారిన పడకుండా కాలనీ వాసులను కాపాడాలి. లేనిచో నిరాహారదీక్ష చేయడానికైనా సిద్ధమే. తక్షణమే పాలకులు స్పందించాలి.

\- మహ్మద్ ముక్తర్, కాలనీవాసి

క్లుప్తంగా

పీరీల ఊరేగింపు



గూడూరు : మండల కేంద్రంలోని చంద్రుగూడెంలో శుక్రవారం మొహరం పండుగ సందర్భంగా పీరీలను ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పూలు, బాసింగాలు, చక్కెర, వడపప్పు ఇచ్చి భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు యాకూబ్, ఉపేందర్, మీరాసాబ్, షాజాహాన్ పాల్గొన్నారు.

కురవిలో పీరీల సందడి

కురవి : మండల కేంద్రంలో అయ్యగారిపల్లి గ్రామంలో ముస్లింలు పవిత్రంగా భావించే పీరీల పండుగను పురస్కరించుకుని పీరీలను ఎత్తుకుని యువకులు సందడి చేశారు.

నియామకం


హన్మంతునాయక్

డోర్నకల్ : లంబాడీల ఐక్యవేదిక (లైవ్) డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మండలంలోని చాప్లాతండా గ్రామానికి చెందిన భూక్యా హన్మంతు నాయక్ నియమితులయ్యారు.

పరిశుభ్రత పాటించాలి



గూడూరు : పరిసరాల శుభ్రతతో పాటు ఆరోగ్య శుభ్రత పాటించాలని డాక్టర్ యమున అన్నారు. మండలంలోని భూపతిపేట శివారు కారంపాడితండాలో శుక్రవారం అయోధ్యపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తండాలోని 37 మందికి వైద్యపరీక్షలు చేయగా, నలుగురు జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరికి మందులు అందించారు. అనంతరం తండాలో ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరస్వామి, డాక్టర్ దేవేందర్, ఎంఎల్‌హెచ్‌పీ విశాల, హెల్త్ అసిస్టెంట్ సర్దార్‌బాబు, నరేందర్‌రెడ్డి, శ్రవంతి, రజిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

దంతాలపల్లి : మండలంలోని పెద్దముప్పారం పల్లె దవఖానా ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు వాణి స్థానికులకు పరీక్షలు నిర్వహించారు. డెంగీ, మలేరియా, బీపీ, షుగర్, తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

నూతన కమిటీ ఎన్నిక


సోమేశ్వర్, ప్రశాంత్‌రెడ్డి

కేసముద్రం : గుమస్తాల సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా బొల్లు సోమేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా కొడకండ్ల ప్రశాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఐఎఫ్‌టీయూ అనుబంధ గుమస్తాల సంఘం నూతన కమిటీని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు ముత్యాల శివకుమార్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు శివారపు శ్రీధర్ సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘం ఉపాధ్యక్షులుగా ఆరెపు మధు, సిరికొండ శ్రీకాంత్, సహాయ కార్యదర్శులుగా లెక్కల దేవేందర్‌రెడ్డి, బానోత్ హన్మ, కోశాధికారిగా ఆకారపు రవీంద్రాచారి, గౌరవ సలహాదారులుగా బైరు శ్రీనివాసులు, యాకయ్య, చంద్రయ్య, సారయ్య, స్వామి ఎన్నికయ్యారు.

15నుంచి అంగన్‌వాడీల ధర్నా



మరిపెడ : ఈ నెల 15వ తేదీ నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ సిబ్బంది రోజువారిగా ధర్నాలు నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టే ఈ ధర్నాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు. అనంతరం సీడీపీఓ శిరీషాకు ధర్నాకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు కుమ్మరికుంట్ల జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

రేపు గోరింటాకు సంబురాలు

మహబూబాబాద్ రూరల్ : ఆషాఢ మాసం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు గోరింటాకు సంబురాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ బాధ్యులు ఇమ్మడి రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఎవరి దగ్గరైనా గోరింటాకు ఉంటే నూరి తమ వెంట తీసుకుని రాగలరని కోరారు.

మహిళ రక్షణ చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్సై సునంద

మహబూబాబాద్ రూరల్ : విద్యార్థులు చదువులపై దృష్టి సారించాలని షీ టీం ఎస్సై సునంద సూచించారు. ఈ మేరకు మహబూబాబాద్ మండలంలోని అమనగల్ జెడ్పీఎస్ఎస్‌లో మహిళల రక్షణ చట్టాలపై షీ టీం విధులు, మానవ అక్రమ రవాణా, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, సైబర్ నేరాలపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే లిఫ్ట్ చేయొద్దని, ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు అలవాటుపడినా ఎవరైనా విక్రయించినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ సెకండ్ హెచ్‌ఎం డానియల్, సీనియర్ అధ్యాపకులు దుర్గయ్య, షీ టీం ఏఎస్సై ఆనందం, రూరల్ ఏఎస్సై రమేష్, పీసీ సుప్రజ, భరోసా సిబ్బంది జయశ్రీ పాల్గొన్నారు.

‘నాగరాజును ప్రజాక్షేత్రంలో ఉరితీయాలి’


రాస్తారోకో చేస్తున్న టీజీఎస్ నాయకులు

గార్ల : గిరిజన దంపతులను అత్యంత పాశవికంగా హత్య చేసిన దుండగుడు నాగరాజును పోలీసులు అరెస్ట్ చేసి కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గార్లలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకోను ఉద్దేశించి టీజీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరినాయక్ మాట్లాడారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం 16 చింతల్‌తండాలో గిరిజన దంపతులు బానోత్ శ్రీను–సుగణ ఆరుబయట నిద్రిస్తుండగా మేకల నాగరాజు వారికి హత్య చేయడం విచారకరం అన్నారు. అదే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన తొర్రూరు మండలానికి చెందిన గిరిజన యువకుడి తీవ్రంగా కొట్టిన ఎస్సైని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు ఎం శాంతికుమార్, ఆర్ వీరన్న, శ్రీను, రాజేష్, వెంకన్న, లక్ష్మి, ఘంసీ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐతోనే ప్రజా సమస్యల పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

చిన్నగూడూరు : ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కమ్యూనిస్టుల పోరాటాలే మార్గ నిర్దేశకులని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నగూడూరు మండల కార్యవర్గ సమావేశం గుండంరాజుపల్లిలో నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో మునుపెన్నడు లేనివిధంగా ఆర్థిక అసమానతలు పెరిగాయని, మోదీ అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానలతో దేశ సంపద కారు చౌకగా కట్టబెట్టడమే కారణమని తీవ్రంగా విమర్శించారు. మండల కార్యదర్శి శేషాద్రిరెడ్డి, దొంతు స్టాలిన్, పోలేపాక వెంకన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు / మరిపెడ రూరల్ / నెహ్రూసెంటర్/ దంతాలపల్లి/మహబూబాబాద్ రూరల్ /తొర్రూరు : జిల్లా వ్యాప్తంగా నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఆయా సెక్షన్ పరిధిలో విద్యుత్ శాఖ అధికారులు ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలపై కొమ్మల నరికివేత, మరమ్మతుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా గూడూరు ఏఈ ప్రణీత్, మరిపెడ విద్యుత్ శాఖ ఏడీఈ లోక్‌నాథ్ రెడ్డి, మహబూబాబాద్ విద్యుత్ శాఖ ఏఈ నవ్యశ్రీ, విద్యుత్ శాఖ రూరల్ ఏఈ భోజ్యానాయక్, దంతాలపల్లి ఏఈ మంగళంపల్లి ప్రవీణ్, తొర్రూరు విద్యుత్‌శాఖ ఏఈ వంశీ వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు.

క్రైం కార్నర్

లారీలు ఢీ.. ఇద్దరికి గాయాలు



మరిపెడ రూరల్ : ముందు వెళ్తున్న గ్రానైట్ లారీని వెనుక వస్తున్న మరో లారీ ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మహబూబాబాద్ నుంచి మరిపెడ వైపునకు రెండు లారీలు ఒకదాని వెనక ఒకటి వెళ్తున్నాయి. అయితే మండలంలోని లచ్చతండా స్టేజి వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనక వస్తున్న గ్రానైట్ లారీ ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొంది. ఈక్రమంలో లారీ డ్రైవర్ వెంకన్న, క్లీనర్ నరేష్ క్యాబిన్‌లో ఇరుక్కోగా స్థానికులు వారిని బయటకు తీశారు. చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సడన్ బ్రేక్ వేసిన లారీ ఆపకుండానే డ్రైవర్ వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు.

భార్యపై భర్త హత్యాయత్నం
రిమాండ్‌కు తరలింపు

మహబూబాబాద్ రూరల్ : భార్యపై భర్త హత్యాయత్నం చేయగా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లాలోని గార్ల మండలం మద్దివంచకు చెందిన లావణ్యకు అదే గ్రామానికి చెందిన తోకల సాయికుమార్‌తో 2018లో ప్రేమ వివాహం జరిగింది. కొంతకాలం తర్వాత భర్తతోపాటు అత్తమామలు ఆమెను వేధింపులకు గురి చేయడంతో గతేడాది గార్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. అనంతరం ఆమె మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నందినగర్ ప్రాంతంలో నివాసముండే తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఎప్పటికైనా వేధింపులు తప్పవని తనకు విడాకులు ఇప్పించాలని కోరుతూ మహబూబాబాద్ కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో ఆమె కోర్టు వాయిదాకు రాగా సాయికుమార్ ఆమెపై దాడిచేసి హత్యా ప్రయత్నం చేశాడు. గమనించిన కోర్టు కానిస్టేబుల్ సంపత్ రెడ్డి, స్థానికులు అతడిని అదుపులోకి తీసుకుని టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై అరుణ కేసు నమోదు చేసి అతడిని రిమాండుకు తరలించారు.

నిందితుడి అరెస్ట్

డోర్నకల్ : మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను మహబూబాబాద్‌కు చెందిన జీలకర రాము ఎనిమిది నెలలుగా వేధింపులకు గురి చేస్తున్నాడు. కాగా బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో నమోదు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ ఉపేందర్‌రావు శుక్రవారం తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలు



కొత్తగూడ : విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలైన సంఘటన మండలంలోని వేలుబెల్లిలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కొంపెల్లి లింగన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ సరి చేసేందుకు యత్నించాడు.అయితే ప్రమాదవశాత్తు 11 కేవీ నుంచి వచ్చే వైర్ తగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో లింగన్న ఒంటిపై బొబ్బలు రాగా 108 వాహనం ద్వారా నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థికి సన్మానం

కేసముద్రం : మండలంలోని కల్వల జెడ్పీ హైస్కూల్‌కి చెందిన కోయగూరి హరిణి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించగా శుక్రవారం ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులు రూ.5,116, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ గంట పుష్పలత రూ.1,016, మాజీ చైర్మన్ లింగాల పిచ్చయ్య రూ.1,500లు అందజేశారు.

ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకం



తొర్రూరు : గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమని తొర్రూరు ఆర్డీఓ నర్సింగరావు అన్నారు. పదవీ కాలం ముగిసిన మండలంలోని ఎంపీటీసీలకు శుక్రవారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, తహసీల్దార్ వినోద్‌కుమార్‌లతో కలిసి ఆర్డీఓ మాజీ ఎంపీపీ తూర్పాటి చిన్నఅంజయ్య, ఇతర మాజీ ఎంపీటీసీలను సన్మానించారు.

పరామర్శ



పెద్దవంగర : బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అనపురం శ్రీనివాస్ తండ్రి సోమేంద్రి ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని శుక్రవారం ఆమె పరామర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పల కాపాడుకుంటామని భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, మురళి, శ్రీనివాస్, వెంకన్న, హరికృష్ణ, రవి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఎస్పీఎల్ ఎన్నికలు



కురవి : మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎస్పీఎల్ ఎన్నికలు నిర్వహించినట్లు హెచ్‌ఎం డీసీఎస్ శర్మ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థ గురించి తెలియజేసేందుకు ఈ ఎన్నికలు నిర్వహించినట్లు చెప్పారు. ఎన్నికల అధికారిగా గోవర్దన్, హెచ్‌డబ్ల్యూఓ పద్మ, ఉపాధ్యాయులు వెంకన్న, భద్రు, అనిల్‌కుమార్, రవి, కరీంచంద్, బాలరాజు, శ్రీను, ధర్మ, ఏఎన్‌ఎం నాగమణి పాల్గొన్నారు.

పీఎంజేజేబీవై చెక్కు అందజేత

మహబూబాబాద్ రూరల్ : ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) లో భాగంగా లబ్ధిపొందిన బాధిత కుటుంబానికి రూ.2 లక్షల చెక్కును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఐజీ చౌక్ మేనేజర్ సునీల్, ఫీల్డ్ ఆఫీసర్ మధునాగరాజు శుక్రవారం అందజేశారు. మృతుడు మాచర్ల యాకన్న గతేడాది సీఎస్పీ నరేష్ ఆధ్వర్యంలో రూ.436 చెల్లించి ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకంలో చేరాడు. అనంతరం ఆయన గుండెపోటుతో మృతి చెందగా ఆయనకు నామినీగా ఉన్న భార్య మమతకు రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

సాక్షి ఎఫెక్ట్..



బయ్యారం : ‘బయ్యారంలో విష జ్వరాలు’ వ్యాప్తిపై అనే కథనం శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ, వైద్య సిబ్బంది స్పందించారు. బయ్యారం, వెంకట్రాంపురం గ్రామ పంచాయతీల్లోని పలు వీధుల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించేందుకు వారు చర్యలు చేపట్టారు. అయితే అధికారులు బయ్యారంలోని పలు వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లగా, వెంకట్రాంపురంలో దోమల మందు పిచికారీతో పాటు వీధుల్లోని చెత్తను తొలగించి నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించారు. అనంతరం నివారణ చర్యలు చేపట్టారు.

కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

● ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రావణ్


నినాదాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గార్ల : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు స్థానిక కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు, పందులు, మేకలు సంచరిస్తూ మలవిసర్జన చేయడంతో కళాశాల ప్రాంగణమంతా దుర్గంధం వెదజల్లుతోందని పేర్కొన్నారు. అదే విధంగా ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిన హామీని విస్మరించిందన్నారు. కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాగం లోకేష్, సాంబశివ, సాయి, దివ్య, ఉష, వెంకటేష్, వికాస్, సంతోష్, గణేష్, పాండు, సురేష్, చరణ్, గవాస్కర్, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న స్థానికులు

మరిపెడ రూరల్ : మరిపెడ మండలంలోని భూక్యా తండా పరిధిలోని బోడతండా నుంచి వీరారం వరకు రోడ్డు విస్తరణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి రూ.2.8 కోట్ల నిధులు మంజూరు కాగా ఎన్నికల కోడ్ కారణంగా పనులు ఆలస్యమయ్యాయి. బోడతండా గిరిజనుల చొరవతో రోడ్డు విస్తరణ పనులు మొదలు కావడంతో ఆయా గ్రామల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు బొల్లం నర్సయ్య, మాజీ వార్డు మెంబర్ బోడ వీరన్న, బోడ భాషా, హచ్చ, పాప, ఇస్లావత్ నామా, హేమా, హరి, ధర్మా, దస్రు నాయక్, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకోవాలి


మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్



గార్ల: కళాశాలలో.. ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తొర్రూరు : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ కోరారు. వన మహోత్సవంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడితే అది మనలను కాపాడుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బరిగెల నారాయణ, అధ్యాపకులు కుమారస్వామి, సువర్ణ, చారి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించండి

గార్ల : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.గోవిందరావు సూచించారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎ.ప్రసాదరావు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.


తొర్రూరు: మొక్క నాటుతున్న అధ్యాపకులు

వాడవాడలా వనమహోత్సవం

డోర్నకల్ : డోర్నకల్ పరిధిలో వాడవాడనా వనమహోత్సవం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఐదో వార్డులో శుక్రవారం వనమహోత్సవం సందర్భంగా స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఉదయ్, సిబ్బంది నాగరాజు, అహ్మద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గూడూరు : గొల్లగూడెం గ్రామానికి చెందిన గుజ్జుల వీరయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. కాగా మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్ బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి సానుభూతి తెలిపారు. మండల మల్లేష్, గోపగాని యాదగిరి, వెంకన్న, బానోత్ చిన్న ఉన్నారు.

పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో..



కేసముద్రం : మండలంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో చదువుతున్న బోడ పవిత్ర ఇటీవల భవనంపై నుంచి పడగా తీవ్రగాయాలై ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.46,100 ఆర్థికసాయాన్ని అందజేశారు. బొట్టు రమేష్, బానోత్ రవి, ధరంసోత్ బాలు, లాల్‌సింగ్, టీచర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కురవి : బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు, పాఠశాలకు వచ్చిన టీచర్లకు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కుమారస్వామి, జ్యోతి, భాస్కర్, ప్రభాకర్, అనిత, పాఠశాలకు వచ్చిన పద్మలత, రత్నమాల, వెంకటేశ్వర్లు, బాలాజీ, యాకమ్మ, వీరభద్రానికి స్వాగతం పలికారు.

కేసముద్రం : మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు శుక్రవారం వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు రవీందర్, ఏకాంబ్రం, కృష్ణమోహన్, బానోత్ కిషన్, మహబూబ్‌అలీ, కొప్పుల శంకర్‌ను, అలాగే ప్రమోషన్‌పై వచ్చిన వినోద్‌రాజ్, నాగయ్య, రవీందర్, సూర్యనారాయణ, దురేష్‌ను సన్మానించారు.

గుర్తింపు పొందడం అభినందనీయం

బయ్యారం : మండలంలోని కోయగూడెం పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న డేగం శ్రీనివాస్, మధుసూదన్‌కు శుక్రవారం సన్మానం నిర్వహించారు. కొత్తగూడెం పాఠశాల ఎస్ఎంసీ అధ్యక్షుడు వీరు, ఎస్ఎస్‌పోడు హెచ్‌ఎంలు రవీందర్ నాయక్, భిక్షపతి పాల్గొన్నారు.

డోర్నకల్ : అంకితభావంతో విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ పూల్‌చంద్ సూచించారు. ఎంపీపీఎస్‌కు చెందిన ఉపాధ్యాయుడు డి.ప్రభుదాస్ సొంత ఖర్చుతో బ్యాగులు, షూస్, నోటు బుక్స్‌లు సమకూర్చగా శుక్రవారం ఎంఈఓ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభుదాస్, గౌసియా, వెంకట్రావ్ ప్రతీఏటా విద్యార్థులకు మెరుగైన వసతులు సమకూరుస్తుండటం అభినందనీయమన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న గౌసియాను ఘనంగా సన్మానించారు.

మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులు



పెద్దవంగర : ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గ నిర్దేశకులుగా ఉండాలని రిటైర్డ్ హెచ్‌ఎం సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం లీలాశోభారాణి పేర్కొన్నారు. మండలంలోని బొమ్మకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించిన ఎండీ రహమన్, బి.కృష్ణ, ఎండీ వహిద్ పాషా, ఎస్.అమర్ ఇటీవల బదిలీ కాగా, శుక్రవారం వారిని సన్మానించారు.

తొర్రూరు : బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మండలంలోని హరిపిరాల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు సత్కరించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఎల్. శ్రీనివాసులు, విజయలక్ష్మిలతో పాటు పదోన్నతిపై వచ్చిన చంద్రప్రకాశ్, రాజు, రవీందర్, ఆంజనేయులును సత్కరించారు.

ఆత్మీయ వీడ్కోలు

నెల్లికుదురు : మండలంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు యాకయ్య, ధనలక్ష్మి, సరిత, నాగేంద్ర, దయాకర్, రజనీకాంత్‌లకు సన్మానించారు.